# ఆండాళ్ళమ్మ

-సోమంచి రామం



అన్నపూర్ణా అపార్ట్‌మెంట్స్‌లో ఆడవాళ్లందరికీ ఆండాళమ్మగారంటే హడల్. ఆవిడ ఆడపిల్లల స్కూల్ హెడ్‌మిస్ట్రెస్. అయితే పిల్లలు భయపడాలిగానీ అపార్టుమెంటుల్లో వాళ్లు భయపడడమేమిటి? విడ్డూరంగా వుందే అనుకుంటున్నారా? అదే తమాషా!

★★★

"అయ్యయ్యో! ఇదేమిట్రా? ఈ దెబ్బలేమిటి? ఈ రక్తమేమిటి?" అంటూ పదిహేనో ఫ్లాట్లోని పంకజాక్షి కంగారుపడుతోంది.

"ఏంలేదమ్మా. స్కూటర్ యాక్సిడెంట్ అయింది. మోకాలు కొట్టుకుపోయింది. అంతే. డోంట్‌వర్రీ" అంటూ బాధతోనే చెప్పాడు రవి.

"అదృష్టవంతుడివిరా నాయనా!" అప్పుడే అక్కడ ప్రత్యక్షమయింది ఆండాళమ్మగారు.

"అదేంటి పిన్నిగారూ! అసలే దెబ్బ తగిలి అబ్బాయి బాధపడుతుంటే అదృష్టమంటారేమిటి? మీ ధోరణేం బాగాలేదు" బాధగా అంది.

"నిజంగా మీ అబ్బాయి అదృష్టవంతుడే. మోకాలు చిప్ప మాత్రమే గీసుకుపోయింది. లేకపోతే కాలే ఫ్రాక్చర్ అయ్యేదేమో!"

"ఏమిటో మీ ధోరణి మాకేం అర్థంకాదు. చాల్లెండి. ఇక దయచేయండి" అంది పంకజాక్షి.

★★★

"అమ్మా! అమ్మా...! లలితాంటిగారమ్మాయి ఆటోలో వస్తుంటే యాక్సిడెంట్ అయిందిట. పాపం అక్కడికక్కడే ప్రాణం పోయిందిట. వాళ్లమ్మావాళ్లు ఎంత గోల పెట్టేస్తున్నారో" అంటూ పరుగెత్తుకుని వచ్చి చెప్పింది పన్నెండేళ్ల పద్మ.

"అదృష్టవంతురాలు" అంది ఠపీమని ఆండాళమ్మగారు అటుగా వెడుతూ.

"అదేంటి ఆండాళ్మగారూ! పాపం వాళ్ల పిల్లపోయి వాళ్లేడుస్తుంటే అదృష్టవంతురాలు అంటారేమిటి?" అంది కోపంగా అనసూయమ్మ.

"అవును నిజంగా అదృష్టవంతురాలే. ఒకవేళ ఏ కాలో విరిగి బ్రతికిందనుకో దానికెంత ఖర్చవుతుంది? అంత ఖర్చు చేసినా అవిటికాలు దాన్ని ఎవరు పెళ్లి చేసుకుంటారు? వాళ్లమ్మా నాన్నా ఎన్నాళ్లుంటారు? తర్వాత దాని గతేమిటి?"

"చాలు చాల్లేవమ్మా. ఏ అవిటి కాలైనా బతికుంటే ఏ ఉద్యోగంలో చేరో తన బతుకు తను బతికేది"

"అది మరీ ప్రమాదం. ఏ ఉద్యోగంలో చేరినా అంగవైకల్యం కలది, ఎదురు తిరగలేదు అని అందరి కళ్లు దానిమీదే వుంటాయి. లోకం పోకడ అలా ఉందిప్పుడు" అంది ఠాపీగా.

"ఛీ...ఛీ... ఇంత వితండవాదం ఎక్కడా చూడలేదు. అసలు నీ మనసులో ఏముందో మాక్కాదు కదా బ్రహ్మక్కూడా తెలీదేమో"

"కాదమ్మా...అర్థంకాదు. నిజం నిష్ఠూరంగానే వుంటుంది. అయినా నేను వాస్తవమే చెబుతాను. ఇప్పుడా పిల్ల పోయిందా? ఈ రోజంతా కాదంటే మరో రెండు రోజులు ఏడుస్తూ కూర్చుంటారు. ఆ తరువాత అంతా మర్చిపోతారు. పన్నెండోరోజున అన్నీ మర్చిపోయి హాయిగా నవ్వుతూ భోజనాలు చేసేవాళ్లని ఈ రోజుల్లో ఎంతమందిని చూడ్డంలేదు"

★★★

ఒకరోజు పిడుగులాంటి వార్త ఆండాళ్లమ్మగారి కంటపడింది. అంతే!

"ఓర్నాయనో! కొంప మునిగిపోయిందిరా దేవుడా!" అంటూ శోకాలు మొదలుపెట్టింది.

ఈ శోకాలు విని ఫ్లాట్లలో వాళ్లందరూ పరుగు పరుగున వచ్చేసారు.

"ఏమిటండీ ఏం జరిగింది? ఎందుకలా ఏడుస్తున్నారు?" ఆండాళ్లమ్మగారి నోటి వెంట మాట రావడంలేదు. గుడ్లనీరు కుక్కుకుంటూ అక్కడున్న పేపరుకేసి చూసింది.

"బోర్డు తిప్పేసిన బేవార్స్ బ్యాంకు... దిక్కుతోచక దిగాలుపడ్డ డిపాజిటర్లు"

అప్పటికి అందరికీ అర్థమైంది. అత్యాశకుపోయి ఆండాళమ్మగారు ఉన్నదంతా ఆ బ్యాంకులో డిపాజిట్ చేసింది. ఇప్పుడు ఫ్లాట్స్‌లోని వారికందరికీ మంచి అవకాశం దొరికింది.

"మీరు చాలా అదృష్టవంతులు ఆండాళ్లమ్మగారు" అంది పంకజాక్షి.

"ఏం అదృష్టం.. సొమ్మంతాపోయి నేను ఏడుస్తుంటే అలా అంటారేమిటి?" కోపంగా అందామె.

"అదేంటి అలా అంటారు? అసలా మాట కొస్తే సొమ్మేగా పోయింది. ప్రాణాలు పోలేదుగా. ఆ బ్యాంకు మీ ప్రాణాలు కాపాడింది" అంది అనసూయమ్మ.

"ఏంటి మీరు వాగేది?"

"అవునండీ. ఆవిడన్నది కరెక్టే. ఆ బ్యాంకు కనుక అంత వడ్డీ ఇస్తామని చెప్పకపోతే మీరు ఆ బ్యాంకులో సొమ్ము డిపాజిట్ చేసేవారా? ఇంట్లోనే అదే ఫ్లాట్‌లోనే దాచేవారు. ఆ విషయం తెలుసుకుని ఏ దొంగలో అర్ధరాత్రి వచ్చి మీ తల పగలకొట్టి మీ సొమ్మంతా ఎత్తుకుపోయేవారు. ఇప్పుడు మీ సొమ్మే పోయింది. ప్రాణాలు దక్కాయి. ఏమంటారు మీరంతా?" అంటూ తన అక్కసంతా తీర్చుకుంది వరాలమ్మగారు.

"నిజమే...నిజమే" అంతా కోరస్‌గా ఒక్కసారి అన్నారు.

"ఊరుకోండి ఆండాళమ్మగారూ! ఏంచేస్తాం? ఇకనుంచైనా అయినదానికీ కానిదానికీ ప్రతివాళ్లనీ అదృష్టవంతులంటూ బాధపెట్టకండి. వస్తాం" అంటూ అంతా వెళ్లిపోయారు.

పాపం... ఆండాళమ్మగారు మిడిగుడ్లు వేసుకుని చూస్తూ ఉండిపోయింది.

★